

25న షర్మిల కాకినాడ రాక

కాకినాడ సిటీ, జనవరి 22: కాంగ్రెస్ పార్టీ జిల్లా సమీక్షా సమావేశాల నిమిత్తం ఈనెల 23 నుంచి 31 వరకు రాష్ట్ర వ్యాప్త పర్యటనలు చేయనున్న ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల 25న కాకినాడ రానున్నారు. ఆరోజు ఉదయం 10 నుంచి 11 గంటల వరకు కాకినాడలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం అమలాపురం బయలుదేరి వెళ్లనున్నారు.



లెక్క తేలింది!

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఎట్టకేలకు ఓటర్ల లెక్క తేలింది. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో ఓటర్లుగా ఎంతమంది ఉన్నారనేది తుది జాబితా వెల్లడైంది. ఈ మేరకు ఓటర్ల తుది జాబితాను రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారికంగా వెల్లడించింది. దీని ప్రకారం జిల్లాలో మొత్తం ఏడు నియోజకవర్గాల పరిధిలోని 1,637 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం ఓటర్ల సంఖ్య 15,99,06గా నిర్ధారణయింది. వీరిలో పురుష ఓటర్లు 7,88,105మంది, మహిళ ఓటర్లు 8,10,781 మంది, ఇతర ఓటర్లు 179మందిగా నమోదయ్యారు. తద్వారా జిల్లాలో పురుషుల కంటే మహిళాఓటర్లు 22,676మంది అధికంగా ఉన్నట్లు తేలింది. కాగా నియోజకవర్గాలవారీగా పరిశీలిస్తే జిల్లాలో అత్యధిక ఓటర్లు ఉన్న నియోజకవర్గంగా కాకినాడ రూరల్ తేలింది. ఇక్కడ మొత్తం 2,61,186మంది ఓటర్లున్నారు. వీరిలో పురుష ఓటర్లు 1,29,584మంది, మహిళా ఓటర్ల సంఖ్య 1,31,591మంది. కాగా 2019 అసెంబ్లీ ఎన్నికలప్పుడు జిల్లాలో కాకినాడ సిటీ నియోజకవర్గం అత్యధిక ఓటర్లతో తొలిస్థానంలో నిలిచింది. అప్పట్లో ఈ నియోజకవర్గంలో 2,55,716మంది ఓటర్లు ఉన్నారు. ఐదేళ్ల తర్వాత 2024 అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమైన తుది ఓటర్ల జాబితాలో కాకినాడ రూరల్ నియోజకవర్గం అత్యధిక ఓటర్లతో తొలిస్థానంలో నిలిచింది. తాజా ఓటర్ల జాబితాలో కాకినాడ సిటీ నియోజకవర్గం రెండోస్థానంలో నిలిచింది. కాగా సోమవారం నాటి తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 2,11,937మందితో అత్యల్ప ఓటర్లున్న నియోజకవర్గంగా పెద్దాపురం నిలిచింది. ఇక్కడ పురుషఓటర్లు 1,04,446మంది, మహిళలు 1,07,478మంది ఉన్నారు. జిల్లాలో అత్యధిక మహిళా ఓటర్లు ఉన్న నియోజకవర్గంగా కాకినాడ రూరల్ నియోజకవర్గం గుర్తింపు పొందింది. ఇక్కడ 1,31,519మంది మహిళలు ఓటర్లుగా నమోదయ్యారు. పెద్దాపురం నియోజకవర్గంలో జిల్లాలోనే అత్యల్పంగా 1,07,478 మంది మహిళా ఓటర్లున్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో మొత్తం ఓటర్లు 15,63,226మందిఉండగా, తాజాగా 2024 తుది జాబితాప్రకారం జిల్లాలో ఓటర్లు 15,99,065గా తేలారు. అంటే ఈ ఐదేళ్లలో జిల్లాలో పెరిగిన మొత్తం ఓటర్లు 35,839మంది మాత్రమే.

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్	మొత్తం
తుని	1,09,052	1,11,800	25	2,20,877
ప్రత్తిపాడు	1,05,412	1,08,207	20	2,13,639
పిఠాపురం	1,15,223	1,14,819	04	2,30,046
కాకినాడ రూరల్	1,29,584	1,31,591	11	2,61,186
పెద్దాపురం	1,04,446	1,07,478	13	2,11,937
కాకినాడ సిటీ	1,13,177	1,23,166	94	2,36,437
జగ్గంపేట	1,11,211	1,13,720	12	2,24,943
మొత్తం	7,88,105	8,10,781	179	15,99,065

చేరికలు.. తీసివేతలు..

గతేడాది అక్టోబరు 27న ప్రచురించిన డ్రాఫ్ట్ పబ్లికేషన్ నాటికి జిల్లాలో మొత్తం 15,89,755మంది ఓటర్లుగా నమోదవగా సోమవారం తుది జాబితా లెక్క తేలేసరికి 70,478మంది ఓటర్లు అదనంగా జాబితాలో చేరారు. మరణాలు, ఇతరప్రాంతాలకు వలస వెళ్లిపోవడం, డబుల్ ఎంట్రీలన్నీ కలిపి 61,168మంది ఓటర్లను తొలగించారు. ఓటర్ల తుదిజాబితా ప్రకారం జిల్లాలో 18నుంచి 19ఏళ్ల మధ్య వయసుగల 26,059మంది నూతన ఓటర్లుగా నమోదయ్యారని కలెక్టర్ తెలిపారు. 2,013గృహాల్లో పదిమంది ఓటర్లకంటే ఎక్కువ నమోదైనట్లు గుర్తించి సవరించామన్నారు. జిల్లాలో 17,716మంది డిజిటల్ ఓటర్లుగా నమోదయ్యారని వివరించారు. తుదిఓటర్ల జాబితాలోమొత్తం ఓటర్లలో 17,716మంది దివ్యాంగులు, 792మంది సర్వీసు ఓటర్లు తమ ఓటు నమోదు చేసుకున్నారు. జిల్లాలో 6,972మంది సెక్స్‌వర్కర్లు ఉండగా, వీరిలో 6,937మంది ఓటర్లుగా నమోదయ్యారు. 179మంది ట్రాన్స్‌జెండర్లు ఓటర్లుగా నమోదయ్యారు. కొత్తగా తుని, ప్రత్తిపాడు, జగ్గంపేటలో చెరో పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

- ఎట్టకేలకు జిల్లా తుది ఓటర్ల జాబితా ఖరారు
- జిల్లాలో మొత్తం ఓటర్లు 15,99,065
- పురుష ఓటర్లు 7,88,105
- మహిళా ఓటర్లు 8,10,781
- 2,61,186 మందితో జిల్లాలో అత్యధిక ఓటర్లున్న నియోజకవర్గంగా కాకినాడరూరల్
- 2,11,937మందితో అత్యల్ప ఓటర్లున్న నియోజకవర్గంగా పెద్దాపురం
- జిల్లాలో 6,972మంది సెక్స్‌వర్కర్లకుగాను 6,937మంది ఓటర్లుగా నమోదు
- 2019 అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల జాబితాతో పోల్చితే ఐదేళ్లకు పెరిగిన ఓట్లు 35,839

జిల్లాస్థాయి కలెక్టరేట్ 'స్పందన'కు 245 అర్జీలు

కాకినాడ సిటీ, జనవరి 22: జగనన్నకు చెబుదాం.. జిల్లాస్థాయి స్పందనకు 245 అర్జీలు అందాయి. కాకినాడ కలెక్టర్ కార్యాలయ స్పందన హాల్‌లో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో జేసీ ఇలాక్కియ అర్జీలు స్వీకరించారు. ఆమెతోపాటు ఇన్‌చార్జి డీఆర్వో కె.శ్రీరమణి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు, సీపీవో పి.త్రినాథ్, పౌరసరఫరాల సంస్థ డీఎం డి.పుష్పమణి ప్రజలనుంచి వినతులు అందుకున్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ స్పందనలో అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం అందించాలన్నారు. ఒకే అంశంపై మళ్లీ అర్జీలు నమోదు కాకుండా అధికారులు ప్రత్యేకదృష్టి పెట్టాలని సూచించారు. జిల్లాస్థాయి అధికారులు, కలెక్టరేట్‌లో వివిధ సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఎస్పీ 'స్పందన'కు 52 అర్జీలు

కాకినాడ క్రైం, జనవరి 22: వ్యక్తిగత సమస్యలతో బాధపడుతూ పోలీస్‌స్టేషన్‌లో పరిష్కారంకాక జిల్లావ్యాప్తంగా 52మంది అర్జీదారులు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఎస్పీ సుబ్రమణి సతీష్‌కుమార్ నిర్వహించిన స్పందన కార్యక్రమానికి హాజరై తమ గోడును విన్నవించారు. ఫిర్యాదుదారుల గోడు విన్న ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడారు. చార్టెర్డ్ అకౌంటెంట్ డీపీఆర్ స్వామి అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా అర్జీదారులకు మధ్యాహ్నం భోజన సదుపాయాన్ని కల్పించారు. గ్రీవెన్స్‌కు 12 సివిల్‌తగాదాలు, 17 కుటుంబ తగాదాలు, ఇతర సమస్యలకు సంబంధించి 23 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ వెల్లడించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ పెదిరెడ్డి రామచంద్రరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై కక్ష సాధింపు

- 'ఛలో తాడేపల్లి'కి వెళ్తున్న వారి అడ్డగింత
- అర్ధరాత్రి చర్చలు ఫలించి సమ్మె విరమణ

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 22: అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఎన్నికల ముందు సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ 42రోజులుగా ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మెచేస్తున్నారు. పదిరోజుల క్రితం సమ్మెలో పాల్గొన్నవారికి ఎస్మా నోటీసులు ఇచ్చింది. అయినా అంగన్‌వాడీలు వెనక్కి తగ్గకపోవడంతో టెర్మినేషన్ లెటర్‌లతో వారిని భయభ్రాంతులకు గురిచేస్తోంది. సోమవారంనుంచి విధులకు హాజరుకావాలని కలెక్టర్ కృతికాశుక్లా ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. విధులకు హాజరుకాని వారిని క్రమశిక్షణ చర్యల్లో భాగంగా తొలగిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే కలెక్టర్ చైర్మన్‌గా ఐసీడీఎస్ సీడీపీవోలు,పీడీ, ఆర్డీవో, డీఎంహెచ్‌వో కమిటీగా ఏర్పడి ప్రభుత్వ ఆదేశాల మేరకు విధుల్లో చేరని అంగన్‌వాడీలకు టెర్మినేషన్ లెటర్ ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. కాకినాడ జిల్లాలో 9 ప్రాజెక్టులకుగాను 1,986 సెంటర్లు ఉన్నాయి. 1,971మంది వర్కర్లకుగాను 151మంది, ముగ్గురు ఆదర్స్ విధుల్లోకి చేరారు. 1,913మంది హెల్పర్స్‌కుగాను 121మంది హెల్పర్స్, 18మంది ఆదర్స్ విధుల్లోకి చేరారు. మిగిలిన వారు సమ్మెలో కొనసాగుతుండడంతో మంగళవారం టెర్మినేషన్ లెటర్లు అందించేందుకు రంగం సిద్ధం చేయగా అర్ధరాత్రి ప్రభుత్వంతో చర్చలు ఫలించడంతో అంగన్‌వాడీలు సమ్మె విరమించారు.



కొవ్వూరు నుంచి గొల్లప్రోలు పోలీస్‌స్టేషన్‌కు అంగన్‌వాడీలను తరలించిన పోలీసులు

అంగన్‌వాడీల నిర్బంధం

పిఠాపురం, జనవరి 22: డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లపై ప్రభుత్వం కక్ష సాధింపులకు దిగింది. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోవడంతో సోమవారం తాడేపల్లిలోని సీఎం జగన్ నివాసం ముట్టడికి అంగన్‌వాడీలు పిలుపునిచ్చారు. ఎక్కడికక్కడ పోలీసులు అంగన్‌వాడీవర్కర్లు, హెల్పర్లు వెళ్లకుండా నిలువరించడంతోపాటు ముందస్తుగా నోటీసులు జారీచేశారు. రైల్వేస్టేషన్‌లు, బస్టాండ్లలో నిఘా పెట్టి అడ్డుకున్నారు. పలువురిని ముందస్తు అరెస్టు చేశారు. కాకినాడ జిల్లా దాటిన వారిని కొవ్వూరు, ఏలూరు, విజయవాడ తదితర ప్రాంతాల్లో అడ్డుకున్నారు. విజయవాడలో పోలీసులు అడ్డుకునే ప్రయత్నంలో జరిగిన తోపులాటలో పిఠాపురం, గొల్లప్రోలు, ప్రత్తిపాడు, తుని ప్రాంతాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు గాయపడ్డారు. వీరు మచిలీపట్నం, విజయవాడ సహా పలుచోట్ల ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.



విజయవాడలో తుని అంగన్‌వాడీలను అరెస్ట్ చేసి తరలిస్తున్న పోలీసులు




(అనపర్తి)

కొప్పవరం సంబరం

సత్తెమ్మ తల్లి కొంగు బంగారం





ధనిక, పేద, కులం, మతం, చిన్న పెద్ద తారతమ్యం లేకుండా నీ మొక్కులు చెల్లించడానికి వచ్చాం..కరుణించమ్మా అంటూ భక్తులు వేడుకున్నారు. కొంగు బంగారమైన సత్తెమ్మ తల్లి మొక్కులు తీర్చుకున్నారు. అనపర్తి మండలం కొప్పవరంలోని కర్రి వారి సత్తెమ్మ జాతర సోమవారం వైభవంగా జరిగింది. మూడు రోజులు జరిగే ఈ సంబరం సోమవారం జరిగిన జాతరతో ముగిసింది.




పండుగకి 200 ఏళ్ల చరిత్ర

సుమారు 200 సంవత్సరాల చరిత్ర కలిగిన అమ్మవారి ఆవిర్భావంపై ఇక్కడ ఒక కథ ప్రాచుర్యంలో ఉంది. సుమారు 200 సంవత్సరాల క్రితం ఊతకోటకు చెందిన ఐదుగురు సభ్యులు గల కర్రి వారి వంశీయులు గ్రామంలో పనులు లేక ఏమి చేయాలో పాలుపోని పరిస్థితిలో గోదావరి పాయకు చేరుకుని విచార వదనంలో బాధపడుతుండగా అక్కడకు ఒక పాప వచ్చి వారి కష్టాన్ని అడిగి తెలుసుకుంది. బతికేందుకు మంచి ప్రాంతాన్ని చూపుతానని తనతో రావాలంటూ అనపర్తి మండలం కొప్పవరం గ్రామం తీసుకువచ్చి ఇక్కడ మీరు బతికేందుకు అన్ని సదుపాయాలు ఉన్నాయని సుఖసంతోషాలతో జీవించాలని చెప్పి అంతర్ధానమైంది. దీంతో వారంతా తమకు దారి చూపేందుకు సత్తెమ్మ తల్లి బాలిక రూపంలో వచ్చిందని నమ్ముతూ ఆమెను అమ్మరూపంగా ఆరాధించడం ప్రారంభించారు. ఇలా జరుగుతుండగా కొప్పవరం చేరుకున్న కర్రి వంశీయులు ఇక్కడ వ్యవసాయం చేయడం ప్రారంభించారు. ఇలా వారంతా సంతోషంగా బతుకుతున్న తరుణంలో కళ్ళాల్లో ధాన్యం దొంగలపాలవడం ప్రారంభమైంది. ఒక రోజు అమ్మవారు భక్తుడి కలలోకి వచ్చి పంటను దొంగలు దోచుకుంటున్నారని తాను నాగదేవత రూపంలో కళ్ళం వద్ద ఉన్నానని చెప్పడంతో అక్కడికి వెళ్లిన రైతు దొంగలను చూసి ఆశ్చర్యపోయాడు. రైతును చూసిన దొంగలు పరారయ్యారు. నాగ దేవత రూపంలో ఉన్న అమ్మవారు సమీపంలో ఉన్న పాముల పుట్టలోకి వెళ్లి అంతర్ధానమయ్యారు. దీంతో కర్రి వారి వంశీయులు ప్రతి రెండేళ్లకు ఒకసారి జాతరలో నాగదేవతను పూజించడం ఆచారంగా వస్తోంది.



వివిధ వేషధారణల్లో భిక్షాటన చేస్తున్న భక్తులు

3 రోజుల సంబరం

మొదటి రోజు మిద్దెపై ఉన్న కత్తిరి కుండను కిందకు దింపడంతో అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. దింపిన కుండకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పూజలు నిర్వహించిన కుండను సంతానం లేని వారు శిరస్సుపై ధరిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. రెండో రోజు పుట్ట వద్దకు వేషాలు ధరించి వెళ్లిన భక్తులు అమ్మకు పాలు పోసి పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఆలయం వద్దకు చేరుకుని భక్తులు ఆలయ పూజారులతో బడిత పూజ చేయించుకుంటారు. ఇలా చేస్తే వచ్చే రెండేళ్ల పాటు అమ్మ కాపాడుతుందని భక్తుల నమ్మకం.

ఆఖరి రోజున భిక్షాటన జాతర

ప్రతి రెండేళ్లకోసారి జరిగే ఈ జాతరలో ప్రతి అంశం ఆసక్తికరంగా ఉంటుంది. ఇక్కడ అమ్మవారికి మొక్కులు చెల్లించుకునే భక్తులు ఏదో ఒక విచిత్ర వేషం ధరించి జాతరలో భిక్షాటన చేయాలి. అలా భిక్షం తీసుకోగా వచ్చిన కానుకలను మాత్రమే అమ్మ స్వీకరిస్తుందని ఇక్కడి భక్తుల విశ్వాసం. దీంతో సోమవారం జరిగిన జాతరలో భక్తులు అనేక వేషాలు ధరించి భిక్షాటన చేశారు. మోతుబరి నుంచి కూలీ వరకు, విద్యాధికుడి నుంచి నిరక్షరాస్యుడి వరకు కుల, మత, జాతి, ధనిక, పేద తారతమ్యం లేకుండా వేషాలు ధరించి భిక్షాటన చేస్తూ మొక్కులు తీర్చుకున్నారు. సినిమాలో పాత్రలను వేషాలుగా ధరించిన వ్యక్తులు డైలాగులు వల్లిస్తూ అలరించారు. సాధారణంగా జాతరలు రాత్రి పూట నిర్వహిస్తారు. కానీ ఇక్కడ పగటి పూట నిర్వహించడం విశేషం. సత్తెమ్మ తల్లిని సర్పంచ్ కర్రి బులిమోహనరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు, తనయుడు మనోజ్‌రెడ్డి, తెలుగు మహిళలు జుత్తుగ సూర్యకుమారి, పోతంశెట్టి సుభాషిణి, సిరసపల్లి నాగేశ్వరరావు, తమలంపూడి సుధాకరరెడ్డి, బాసి, కర్రి వెంకటరామారెడ్డి, ఆళ్ల గోవింద దర్శించుకున్నారు.








రత్నగిరిపై ఎల్‌ఈడీ స్ర్కీన్‌లో ప్రతిష్ఠాపనోత్సవాలు

అన్నవరంలో శోభాయాత్ర

అన్నవరం, జనవరి 22: అయోధ్య రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం అన్నవరంలో సంబరాలు అంబరాన్నంటాయి. విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం లైవ్ ద్వారా తిలకించాలనే ఉద్దేశ్యంతో ఈవో రామచంద్రమోహన్ ప్రత్యేక ఎల్‌ఈడీ స్ర్కీన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సత్యదేవుడి క్షేత్ర పాలకులుగా పూజలందుకుంటున్న సీతారాముల ఆలయంలో అభిజిత్ లగ్నంలో ప్రత్యేక పూజలు నిర్వహింపచేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామంలో పార్టీలకతీతంగా నాయకులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో శోభాయాత్రను నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ వందలాది మందితో ర్యాలీ చేపట్టడంతో రామనామ జపంతో అన్నవరం మార్మోగిపోయింది. కార్యక్రమాన్ని దేవస్థానం ఈవో రామచంద్రమోహన్ ప్రారంభించారు. సుమారు 10 కిలోమీటర్ల మేర ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో శోభాయాత్ర కమిటీ సభ్యులు కామర్స్ చిరంజీవి, పోచినపెద్ది రాధాకృష్ణ, దాసరి నగేష్, ప్రసాద్, గణపతి, సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్‌రాజా, వైస్ ఎంపీపీ దారా వెంకటరమణ, ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభరాజా, టీడీపీ నాయకులు మధుబాబు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ముక్కామల కళాకారులు



అంబాజీపేట, జనవరి 22: దేశ రాజధాని ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ పెరేడ్‌లో ఏపీ ప్రభుత్వ శకటం తరపున పాల్గొనేందుకు బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ముక్కామలకు చెందిన కూచిపూడి కళాకారులకు అవకాశం దక్కింది. ఏపీ సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ పోతుల కిరణ్‌కుమార్ సారథ్యంలో ముక్కామలకు చెందిన వాయిద్య కళాకారుడు పసుపులేటి నాగబాబు ఆధ్వర్యంలో శిక్షణ పొందిన కూచిపూడి కళాకారులు ఈనెల14న ఢిల్లీకి చేరుకున్నారు. అక్కడ శిక్షణ కొనసాగిస్తూ ఈనెల 21న నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో పాల్గొన్నారు. రాష్ట్రీయ రంగస్థల (ఆర్‌ఆర్) క్యాంపు నిర్వాహకులు అన్ని రాష్ట్రాల కళాకారులకు నిర్వహించిన సాంస్కృతిక పోటీలలో ఏపీ తరఫున పాల్గొన్న కూచిపూడి కళాకారులు తృతీయ స్థానం సాధించారు. తమకు శిక్షణ ఇచ్చిన గురువు హేమ సాయికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత ఏడాది ముక్కామలకు చెందిన పసుపులేటి నాగబాబు గరగనృత్య బృందం ఏపీ తరుపున ఢిల్లీలో ఏకాదశ రుద్రుల శకట ప్రదర్శనలో పాల్గొంది.

అయోధ్యకు ప్రత్యేక రైళ్లు

రాజమండ్రి, సామర్లకోట, తుని, అన్నవరం మీదుగా..

సామర్లకోట, జనవరి 22: అయోధ్య రామ మందిరం సందర్శించే భక్తుల సౌకర్యార్థం రైల్వే ఫిబ్రవరి 7,10,11,14 తేదీలలో ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను సామర్లకోట, రాజమండ్రి రైల్వే స్టేషన్ల నుంచి నడుపుతున్నట్లు రైల్వే ట్రాన్స్‌పోర్టేషన్ అధికారి కార్యాలయం నుంచి సోమవారం రాత్రి సమాచారం అందింది.

07217 నంబరు గల రాజమండ్రి-అయోధ్య మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఫిబ్రవరి 7న బుధవారం బయలుదేరనుంది. ఈ రైలు రాజమండ్రిలో ఫిబ్రవరి 7న బుధవారం సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి అనపర్తి, సామర్లకోట, అన్నవరం, తుని, దువ్వాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస మీదుగా అయోధ్యడామ్‌కు శుక్రవారం రాత్రి 11.00కి చేరుతుంది.

07217 నంబరు పేరిట అయోధ్య డామ్-రాజమండ్రి మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఫిబ్రవరి 10న శనివారం బయలుదేరనుంది. ఈ రైలు అయోధ్య డామ్‌లో ఫిబ్రవరి 10న శనివారం రాత్రి 11 గంటలకు బయలుదేరి సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు రాజమండ్రి చేరుతుంది.

07218 నంబరు గల సామర్లకోట-అయోధ్య మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 11న బయలుదేరనుంది. ఈ రైలు సామర్లకోటలో ఆదివారం రాత్రి 6.30 గంటలకు బయలుదేరి అన్నవరం, తుని, దువ్వాడ, విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస మీదుగా అయోధ్యడామ్‌కు మంగళవారం ఉదయం 10.35కి చేరుతుంది. మొత్తం 1,870 కిలోమీటర్ల దూరాన్ని ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు 40.05 గంటల పాటు ప్రయాణిస్తుంది. 07218 నంబరు గల అయోధ్య-సామర్లకోట మధ్య ఫిబ్రవరి 14న బుధవారం రాత్రి 7.55కి బయలుదేరనుంది. ఈ రైలు అయోధ్య డామ్‌లో బుధవారం రాత్రి 7.55కి బయలుదేరి శుక్రవారం మధ్యాహ్నం 1.00 గంటకు చేరుతుంది. మరిన్ని వివరాలకు సమీప రైల్వే స్టేషన్ బుకింగ్ అధికారులను సంప్రదించాలని రైల్వే ఉన్నతాధికారులు ఆ లేఖలో తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం



తుని రూరల్, జనవరి 22: కాకినాడ జిల్లా తునిరూరల్ మండలం చామవరం శివారు వల్లూరు రోడ్డులో గుర్తు తెలియని మహిళ మృతదేహం కనిపించినట్టు ఎస్‌ఐ విజయ్‌బాబు తెలిపారు. స్థానిక వీఆర్వో సమాచారంతో మృతదేహాన్ని పరిశీలించి ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించామన్నారు. మహిళ వివరాలు తెలియలేదని సంబంధీకులు ఎవరైనా ఉంటే రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

రీసెర్చ్ ఫెలోషిప్ సాధించిన యువకుడు

సర్పవరం జంక్షన్, జనవరి 22: యూజీసీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్‌లో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌కు తిమ్మాపురం ఆక్నూ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌కు చెందిన పీజీ విద్యార్థి బాల జయదీప్ ఎంపికయ్యాడు. సోమవారం తిమ్మాపురం పీజీ క్యాంపస్‌లో నిర్వహించిన అభినందన సభలో జయదీప్‌ను ప్రిన్సిపాల్ ప్రశాంతశ్రీ ఆధ్వర్యంలో అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజనీతి, ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగానికి చెందిన బాల జయదీప్ యూజీసీ నిర్వహించిన ఎలిజిబిలిటీ టెస్ట్‌లో ఫెలోషిప్‌కు ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. సివిల్స్ సాధించడమే లక్ష్యంగా చదువుతున్నట్లు జయదీప్ తెలిపారు. కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ కె.జోసెఫ్ స్టీఫెన్, సహాయ ఆచార్యులు డాక్టర్ ఎం.నానిబాబు, డాక్టర్ కె.హరిబాబు, డాక్టర్ ఎం.గోపి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వరహాలు, జూనియర్ అసిస్టెంట్ ఎం.లలిత తదితరులు జయదీప్‌ని అభినందించారు.



జయదీప్‌ను అభినందిస్తున్న అధ్యాపక బృందం

వైసీపీ ప్రభుత్వ హయాంలో కాపులకు అన్యాయం

కాపు ఉప కులాల జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

రావులపాలెం, జనవరి 22: కాపు, కాపు ఉప కులాల సంక్షేమానికి సంబంధించిన సమస్యల పరిష్కారాలు వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురయ్యాయని కాపు జేఏసీ నేత ఆకుల రామకృష్ణ అన్నారు. రావులపాలెంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో సోమవారం ఆయన ఆధ్వర్యంలో రాష్ట్ర కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల జేఏసీ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుల రామకృష్ణ మాట్లాడుతూ కాపు జేఏసీ ఏ పార్టీకీ అనుకూలంగా లేదన్నారు. ముద్రగడ పద్మనాభం సారథ్యంలో గతంలో చేపట్టిన ఉద్యమాలతో కొన్ని ఫలితాలు సాధించామని, అయితే అవి అందట్లేదన్నారు. జనాభా ప్రాతిపదికన కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని, కాపుల సమస్యలపై ప్రధాన రాజకీయ పార్టీలు స్పందించాలని, లేనిపక్షంలో ఓటు అనే ఆయుధంతో ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. కాపులకు గత ప్రభుత్వం 5 శాతం రిజర్వేషన్ కల్పించిందన్నారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేయకపోవడంతో సచివాలయ ఉద్యోగాల భర్తీ సమయంలో కాపు, కాపు ఉప కులాలకు చెందిన నిరుద్యోగులు 24వేల మంది ఉద్యోగాలు కోల్పోయారన్నారు. జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగం, ఉపాధి, రాజకీయాల్లో అవకాశం కల్పించాలన్నారు. వార్డు నుంచి పార్లమెంటు స్థాయి వరకు పదవుల్లో ప్రాధాన్యమివ్వాలన్నారు. నూతన జిల్లాలు ఏర్పడిన సమయంలో ఎందరో ముఖ్య నేతల పేర్లు పెట్టారని, కాపు కులంలో ఉద్యమాలు, పోరాటాలు చేసిన వారి పేర్లు పెట్టలేదన్నారు. నూతన జిల్లాలకు శ్రీకృష్ణదేవరాయలు, వంగవీటి మోహనరంగా, కూర్మ వెంకటరెడ్డి, కన్నెగంటి హనుమంతు, పెరియార్ రామస్వామి పేర్లు పెట్టాలన్నారు. కార్పొరేషన్ నిధులు ఏడాదికి రూ.2 వేల కోట్లు విడుదల చేయాలన్నారు. కాపులకు వెనుకబడిన కేటగిరీల్లో ఐదు శాతం రిజర్వేషన్ కల్పిస్తూ గత ప్రభుత్వం రూపొందించిన బిల్లును వెంటనే అమలు చేయాలన్నారు. రైతు భరోసా పథకాన్ని కాపు కౌలు రైతులకూ అమలు చేయాలన్నారు. ఇదే తరహాలో ఈ నెల 28న విశాఖపట్నంలో జేఏసీ నాయకుడు రాజీవ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తామన్నారు. రాయలసీమ, భీమవరంలో కూడా సమావేశాలు జరుపుతామన్నారు. సమావేశంలో జేఏసీ ముఖ్య నేతలు తోట రాజీవ్, ఆరేటి ప్రకాష్, నల్లా విష్ణుమూర్తి, వాసిరెడ్డి ఏసుదాసు, చందు, జనార్ధన్, దాసరి రాము, ముత్యాల రామదాసు, ఉమామహేశ్వరి, సీహెచ్ వెంకటరాయుడు, మాక శ్రీనివాస్, ముచ్చర్ల శ్రీరామ్, రంకిశెట్టి మంగబాబు తదితరులు పాల్గొన్నారు.



ఐక్యతను చాటుతున్న నేతలు

బాలికను హతమార్చిన సవతి తల్లికి యావజ్జీవం

కాకినాడ క్రైం, జనవరి 22: కన్నతల్లి స్థానంలో ఉండి పిల్లల ఆలనా.. పాలనా చూడాల్సిన సవతి తల్లి స్వార్థపూరిత దుర్బుద్ధితో ఏడేళ్ల బాలికను హతమార్చడమే కాకుండా సాక్ష్యాలు తారుమారు చేసేందుకు మృతదేహాన్ని గోనె సంచిలో కట్టి ఉప్పుటేరులో విసిరేసిన నేరం ఋజువు కావడంతో ఓ మహిళకు కాకినాడ నాలుగో అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎం.హరినారాయణ యావజ్జీవ కారాగార శిక్ష, రూ. 10 వేలు జరిమానా విధించారు. కాకినాడ రూరల్ మండలం, తూరంగి పగడాలపేటకు చెందిన సూరాడ సత్యశ్యామ్‌కుమార్ గతంలో సీసీ కెమెరాల టెక్నీషియన్‌గా పని చేస్తూ రాజమహేంద్రవరంలోని లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలో ఉండేవాడు అక్కడ సత్యవతి అనే ఆమెను 2012లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి 2013లో దీప్తి శ్రీ ఇషాని పుట్టింది. అయితే 2016 లో సత్యవతి బ్రెయిన్ హేమరేజ్‌తో మృతి చెందింది. దాంతో దీప్తికి తల్లి లేని లోటు తీర్చేందుకు శ్యామ్‌కుమార్‌కు అతని కుటుంబీకులు 2017లో కాకినాడ డైరీఫామ్ సెంటర్, సంజయ్‌నగర్‌కు చెందిన శాంతికుమారిని ఇచ్చి వివాహం జరిపించారు. వారికి 2018 లో మోక్షిత్ నూతన్ అనే కుమారుడు జన్మించాడు. అయితే శ్యామ్‌కుమార్‌కు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో ఆ కుటుంబం కాకినాడ డైరీఫామ్ సెంటర్‌కు వచ్చేసింది. అనంతరం తన భర్త పేరున ఉన్న ఇల్లు తన కుమారుడికి కాకుండా దీప్తి పేరున రాసేస్తారేమోనని అపోహ పడి అప్పటి నుంచి కన్న కూతురిలాంటి దీప్తిపై కక్ష పెంచుకుని ఎలాగైనా ఆ చిన్నారిని అంతం చేయాలని పథకం రచించింది. ఈ క్రమంలో తన నానమ్మ ఇంటి వద్ద ఉంటూ జగన్నాథపురం నేతాజీ మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్న దీప్తి వద్దకు శాంతికుమారి 2019 నవంబరు 22న మారు వేషంలో వెళ్లి దీప్తిని ఎవరికి చెప్పకుండా ఇంటికి తీసుకుని వచ్చి టవల్‌తో పీక బిగించి హత్య చేసింది. అనంతరం ఎవరికి అనుమానం రాకుండా ప్లాస్టిక్ సంచిలో మూట కట్టి ఇంద్రపాలెం బ్రిడ్జి పై నుంచి ఉప్పుటేరులోకి విసిరేసి సాక్ష్యం లేదు తనకి ఏమీకాదులే అనుకుని అక్కడ నుంచి వెళ్లిపోయింది. అనంతరం స్కూల్ నుంచి ఇంటికి రాకపోయేసరికి తన కుమార్తె దీప్తి కనబడడంలేదని సత్యశ్యామ్‌కుమార్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి వన్‌టౌన్ సీఐ టి.రామ్మోహన్ రెడ్డి దర్యాప్తు జరిపి నిందితురాలు శాంతికుమారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. వాదోపవాదనల అనంతరం నిందితురాలిపై నేరం ఋజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున ఏపీపీ వై.ప్రశాంతికుమారి వాదించారు. సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టడంలో విశేష కృషి చేసిన ప్రస్తుత వన్‌టౌన్ సీఐ వాడవెల్లి సురేష్‌బాబు బృందాన్ని ఎస్పీ సుబ్రమణి సతీష్‌కుమార్ అభినందించారు.

సముద్ర తీరానికి వెదురు మండపం

అంతర్వేది, జనవరి 22: బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామ పంచాయతీ హైస్కూలు రోడ్డుకు ఆనుకుని ఉన్న సముద్ర తీరం ఒడ్డుకు శ్రీలంకకు చెందిన వెదురుకర్రల మండపం కొట్టుకు వచ్చింది. తీరం వెంబడి శ్రీరామ నామస్మరణతో మార్మోగుతున్న సందర్భంలో సముద్ర కెరటాలకు కొట్టుకువచ్చిన వెదురు కర్రల పల్లకీ చూపరులను మంత్ర ముగ్ధుల్ని చేసింది. వివిధ రకాల ఇత్తడి కిరీట భాగాలు, బౌద్ధ మతాకి చెందిన పేయింటింగులు, శ్రీలంక భాషతో ఉన్న కర్టెన్లతో కూడిన మండపాన్ని చూసేందుకు అంతర్వేది గ్రామ ప్రజలంతా సముద్ర తీరం వెంబడికి తరలి వెళ్లారు. ఈ వెదురు కర్రల మండపం రాష్ట్ర, దేశాల నుంచి అంతర్వేది సముద్ర తీరానికి కొట్టుకు రావడంతో ఆధ్యాత్మిక భావన ప్రజల్లో కలిగి చూసేందుకు ఎగబడ్డారు.




అంతా రామమయం

అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద షిర్డీసాయి విద్యానికేతన్ విద్యార్థులు హనుమాన్ చాలీసా నృత్య రూపకాన్ని ఆకట్టుకునే విధంగా ప్రదర్శించారు. హనుమ వేషధారణలతో చిన్నారులు చక్కటి ప్రదర్శన ఇచ్చారు..



రాజమహేంద్రవరంలో నృత్య రూపకం




హోరాహోరీగా లాన్ టెన్నిస్ పోటీలు

కాకినాడ రూరల్, జనవరి 22: 67వ జాతీయస్థాయి బాలుర లాన్ టెన్నిస్ పోటీలు 3వ రోజు సోమవారం పోటాపోటీగా కొనసాగాయి. 19 ఏళ్లలోపు బాలురకు నిర్వహిస్తున్న ఈ పోటీలు ఈనెల 24 వరకూ కొనసాగనున్నాయని పాఠశాల విద్య జోన్-2 ఆర్జేడీ జి.నాగమణి తెలిపారు. పోటీలు కాకినాడ డీఎస్ఏ, డీమార్ట్ సమీపంలో గల స్మార్ట్‌సిటీ టెన్నిస్‌క్లబ్, ఎస్పీ కార్యాలయం వెనుక గల టెన్నిస్ మైదానంలోనూ జరిగాయి. సోమవారం మొత్తం 24 మ్యాచ్‌లు నిర్వహించగా టీమ్ విభాగంలో హరియాణా, గుజరాత్ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో హరియాణా జట్టు 2-0 స్కోర్‌తో విజేతగా నిలిచిందన్నారు. అదే విధంగా ద్వితీయ స్థానంలో గుజరాత్, తృతీయ స్థానంలో మహారాష్ట్ర, నాలుగో స్థానంలో ఢిల్లీ నిలిచినట్లు తెలిపారు. సింగిల్స్ మ్యాచ్‌లు మొదటి, రెండు రౌండ్‌లు పూర్తయ్యాయన్నారు. లాన్ టెన్నిస్ జాతీయ పరిశీలకులు రామిరెడ్డి విచ్చేసి మ్యాచ్‌లను తిలకించారు. పోటీలను ఎస్‌జీఎఫ్ రాష్ట్ర చైర్మన్ జి.భానుమూర్తిరాజు, ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి బీవీఎస్‌వీ ప్రసాద్, అఫీషియల్స్ కె.శ్రీకుమార్, డీవైఈవోలు డేనియల్‌రాజు, సుభద్ర, డీఎస్‌డీవో బి.శ్రీనివాస్‌కుమార్, ఎంఈవోలు రవి, ఏసుదాసు, శివప్రసాద్, పుల్లయ్య, ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు రంగారావు, పీఈటీలు రవిరాజు, బంగార్రాజు, నూకరాజు, శ్రీనివాస్, పట్టాభి, మాసరరావు, వెంకటేష్, త్రిపుల, భానుమతి, శ్రీనివాస్, సువర్చల, మేరీ విజయ, తులసి, సత్యగౌరి,శ్రీలక్ష్మి, శ్రీహరిరాజు పర్యవేక్షించారు.

భారీగా సిగరెట్ ప్యాకెట్లు స్వాధీనం

రాజమహేంద్రవరం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అధికారులు అనుమతుల్లేని బ్రాండ్ల సిగరెట్లను పెద్ద సంఖ్యలో స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎస్పీ ఎ.సురేశ్‌బాబు వివరాలను వెల్లడించారు. అనుమతులు లేని సిగరెట్ల విక్రయాలపై సోమవారం సోదాలు చేశామన్నారు. రాజమహేంద్రవరం స్టేడియం రోడ్‌లోని మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న శ్రీదేవి బిస్కెట్స్ అండ్ జనరల్ స్టోర్స్‌లో రూ.1.75 లక్షల విలువ చేసే పారిస్, గోల్డ్‌ఫైటర్, ఎ-10, హార్బర్, గోల్డ్ స్టాగ్, గోల్డ్ విమల్, గోల్డ్ విమల్ మింట్ తదితర అనుమతుల్లేని బ్రాండ్ల 4,010 సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. దుకాణం యజమాని దాసరి వెంకట కృష్ణారెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేసి టూటౌన్ పోలీసులకు అప్పగించినట్టు ఎస్పీ వివరించారు. అనుమతుల్లేని సిగరెట్ల అమ్మకం, గుట్కాలను విక్రయించడం, రెస్టారెంట్లు, ఫుడ్ సెంటర్లపై నిరంతర నిఘా పెట్టామని.. నిబంధనల ప్రకారం నడుచుకోకపోతే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ నాగ వెంకటరాజు, తహశీల్దార్ విజయ్‌కుమార్, ఎస్‌ఐ జగన్నాథరెడ్డి, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

చంద్రవరంలో మహిళ దారుణహత్య



చాగల్లు, జనవరి 22: మండలంలోని చంద్రవరం గ్రామంలో ఓ మహిళ సోమవారం దారుణ హత్యకు గురైంది. స్థానికులు, కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సింహాద్రి పూర్ణచంద్రరావు 15 ఏళ్ల క్రితం మృతి చెందాడు. అతని భార్య సుజాత(48) తన ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తోంది. ఐదేళ్ల క్రితం కుమారుడి వివాహం సందర్భంగా ఇంటికి పెయింటు వేయడానికి వచ్చిన అదే గ్రామానికి చెందిన చైతన్యకుమార్ కుటుంబ సభ్యులతో మంచి సంబంధాలు ఏర్పర్చుకున్నాడు. సోమవారం ఇంటి డాబాపై సుజాత బట్టలు ఆరవేస్తున్న సమయంలో కత్తితో మెడపై బలంగా దాడి చేశాడు. అనంతరం డాబా పైనుంచి హడావిడిగా పారిపోతుండడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు డాబాపై రక్తపు మడుగులో ఉన్న సుజాతను చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వైపీ రమణ సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతురాలు తండ్రి మద్దిపాటి నరసింహారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. వివాహేతర సంబంధం కారణంగా సుజాతను హత్య చేసినట్టు అనుమానం వ్యక్తం చేస్తూ ఆ కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిసింది.

వికసిత్ భారత్ సంకల్పయాత్ర

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 22: స్మార్ట్ సిటీ కార్యాలయంలో రాగిరెడ్డి కళాక్షేత్రంలో కేంద్రప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు సోమవారం ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని కేంద్ర కామర్స్ మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి ఐఏఎస్ అధికారి పీయుష్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జేసీ ఇలాక్కియ, స్మార్ట్‌సిటీ సీఈవో, ఎండీ, మున్సిపల్ కమిషనర్ నాగనరసింహారావు, జడ్పీ సీఈవో రమణారెడ్డి వివిధ ప్రభుత్వశాఖల అధికారులు హాజరయ్యారు.

ఓటర్ల తుది జాబితా సీడీల అందజేత

కాకినాడ సిటీ, జనవరి 22: ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024 ఓటర్ల తుది జాబితా సీడీలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు జేసీ అందజేశారు. కలెక్టర్‌లో జేసీ ఇలాక్కియ సోమవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతేడాది అక్టోబరు 27న ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాకు, తుది ఓటర్ల జాబితాలో జరిగిన మార్పులు, జిల్లాలో మొత్తం ఓటర్ల వివరాలు, అందులో స్త్రీ, పురుషులు, ఇతర ఓటర్లు, కొత్తగా నమోదైన ఓటర్ల వివరాలను తెలియజేశారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో కె.శ్రీరమణి, రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, సీహెచ్ రమేష్‌బాబు, గదుల సాయిబాబు, సబ్బారపు అప్పారావు, నరాల శివ, తుమ్మల రమేష్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డీటీ ఓఎం జగన్నాథం పాల్గొన్నారు.

డీఎల్‌పీవో విచారణ

సర్పవరం జంక్షన్, జనవరి 22: వలసపాకల గ్రామ కార్యదర్శి అహ్మదున్నీషా బీబీపై వచ్చిన అవినీతి ఆరోపణలపై సోమవారం డీఎల్‌పీవో అన్నా మణి విచారణ నిర్వహించారు. కొత్త ఇంటికి పన్ను వేసేందుకు రూ.10,500 లంచం తీసుకున్నారంటూ పాలిక బాపూజీ తరపున సూరంపూడి కిషోర్ శనివారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామ కార్యదర్శిపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి నివేదిక అందజేయాలని జిల్లా పంచాయతీ అధికారిణిని కలెక్టర్ ఆదేశించారు. డీపీవో ఉత్తర్వుల మేరకు సోమవారం పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదుదారుడు, గ్రామ కార్యదర్శితో విచారణ నిర్వహించినట్టు డీఎల్‌పీవో తెలిపారు. ఇద్దరి నుంచి స్టేట్‌మెంట్లు స్వీకరించామని, విచారణలో అంశాలను నివేదిక తయారుచేసి డీపీవో ద్వారా కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు.

'వ్యర్థాలు వదలడాన్ని నిలుపుదల చేయించాలి'

కాకినాడ సిటీ, జనవరి 22: ఫార్మా కంపెనీలు పెద్దపెద్ద పైప్‌లైన్ల ద్వారా రసాయనాల వ్యర్థాలను సముద్రంలో వదులుతుండడంతో అటుఇటు 20 కిలోమీటర్ల మేర సముద్ర జలాలు కలుషితమై మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతింటోందని యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ, అమీనాబాద, మూలపేట గ్రామాల సర్పంచ్‌లు, మత్స్యకార సొసైటీ ప్రతినిధులు, మత్స్యకారులు కలెక్టరేట్‌లో జిల్లా అధికారులకు మొరపెట్టుకున్నారు. మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీస్తున్న పైప్‌లైన్ల ద్వారా వ్యర్థాలు వదలడాన్ని నిలుపుదల చేయించాలని సంతకాలతో కూడిన వినతి పత్రం సమర్పించారు. సముద్రం మీద ఆధారపడి జీవిస్తున్న 12వేలమంది జీవనాధారం దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని ఉప్పాడ సర్పంచ్ ఉమ్మిడి జాన్, అమీనబాద సర్పంచ్ నక్కా మణికంఠబాబు, మూలపేట సర్పంచ్ కంబాల లక్ష్మణ్ సూరాడనాగేశ్వరరావు కోరారు.

'టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలి'

ప్రత్తిపాడు, జనవరి 22: ఏపీ ల్యాండ్ న్యూ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని బీసీవై పార్టీ రాష్ట్ర సమన్వయ సారధి దేవర అనూషయాదవ్ డిమాండ్ చేశారు. పెద్దిపాలెంలో సోమవారం చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనూషయాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన యాక్ట్ 27/23 చట్టం వల్ల రైతులు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయన్నారు. ఐలాజ్ ప్రతినిధి బుగతా శివ, బీసీ ఐక్యసంఘర్షణ సమితి కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు, జిల్లా మానవహక్కుల సంఘం అధ్యక్షుడు కె.శ్రీనివాస రెడ్డి, దేవర రమణ పాల్గొన్నారు.

పిఠాపురంలో న్యాయవాదుల దీక్షలు

పిఠాపురం, జనవరి 22: ఏపీ ల్యాండ్ న్యూ టైటిలింగ్ యాక్టు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పిఠాపురంలో కోర్టుల వద్ద జరిగిన న్యాయవాదుల నిరాహారదీక్షల్లో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్.భాస్కరాచార్యులు, న్యాయవాదులు ఐఏ పాషా, దల్లి శ్రీనివాస్ కుర్పోగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎం.రాజారావు, ఎస్ఎం అలీ, బంగారు రామకృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

యోగా గురువు పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లరేవు, జనవరి 22: కోరింగ ప్రభుత్వ హోమియో వైద్యకళాశాలలో కాంట్రాక్టు పద్ధతిన పనిచేసేందుకు యోగా గురువు పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డాక్టర్ ఎం.విజయప్రభ సోమవారం తెలిపారు. నెలలో పురుషులు 32, స్త్రీలు 20 గంటలు పనిచేయాల్సి ఉంటుందన్నారు. పురుషులు స్కూల్స్, చుట్టుపక్కల గ్రామాల్లో, స్త్రీలు వైద్యకళాశాల ఆవరణలో యోగా శిక్షణా తరగతులు నిర్వహించాలని, యోగా డిగ్రీ, పీజీ, డిప్లమా ఉన్నవారితో పాటు యోగా అనుభవం ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు గంటకు రూ.250లు చొప్పున గౌరవ వేతనం ఇస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 9440413117 నంబరును సంప్రదించాలని కోరారు.

ఘనంగా ముగిసిన ఉరుస్ షరీఫ్ గంధోత్సవం

పెద్దాపురం, జనవరి 22: స్థానిక పాతపెద్దాపురం శివారు ప్రాంతంలో ఉన్న హజరత్ షేక్ మదీనా పాచ్చా ఔలియా ఉరుస్ షరీఫ్ గంధోత్సవ వేడుకలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. దర్గా వద్ద భారీ అన్న సమారాధన చేపట్టగా భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు. అలాగే దర్గా కమిటీ అధ్యక్షుడు ఎంఎల్ అలీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి మాజీ చైర్మన్ బొడ్డు బంగారుబాబు, సభ్యులు బాబూలాల్, ఆషిక్ అలీ, అబ్దుల్ రజాక్, సయ్యద్ కరీమ్ జానీ బ్రదర్స్, గౌస్, రఫీ, షేక్‌బాబ్జీ, మున్నీ, రిజ్వాన్, అరీఫ్ అలీ, ఇర్షాద్ అలీ, స్వర్ణతేజ, కరీం, అహ్మద్, జాకీర్, నజీర్, వెంకటరమణ, రాజేష్, నవీన్, వీరబాబు,గణేష్ ఉన్నారు.

నేడు పలు సేవా కార్యక్రమాలు

సర్పవరం జంక్షన్, జనవరి 22: తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదినోత్సవం పురస్కరించుకుని మంగళవారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు ఆ పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. తెలుగుదేశం జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా ఆధ్వర్యంలో విద్యుత్‌నగర్‌లో ఓ ఫంక్షన్ హాల్లో బ్లడ్ బ్యాంకు శిబిరం, మహిళలకు చీరలు పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అలాగే టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి భాస్కర్ (బాబీ) ఆధ్వర్యంలో సర్పవరం జంక్షన్‌లో స్పందన హాల్లో బ్లడ్ బ్యాంకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికంగా పాల్గొనాలని శ్రీనివాసబాబా, బాబీ కోరారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ఫిర్యాదు

తాళ్లరేవు, జనవరి 22: చొల్లంగి సర్వేనంబరు 47/3లో 4.24సెంట్లు సాల్ట్ డిపార్ట్‌మెంటుకు చెందిన ఖాళీ భూమిలో స్థానికులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ చొల్లంగి గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టరు గ్రీవెన్స్‌కు ఫిర్యాదు చేశారు. మాజీ సర్పంచ్ మాసా శ్రీనివాసరావు మాట్లాడుతూ చొల్లంగివాసులకు పటవల, జి.వేమవరంలో ఇచ్చిన స్థలాలను రద్దు చేసి స్థానికంగా పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారా సూర్యకుమారి, దిమ్మల జనార్ధనరావు, మాసా శ్రీనివాస్, వీరబాబు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

కరప, జనవరి 22: మండలంలోని కరప, వేములవాడలో సోమవారం ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటించి అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. కరపలో రూ.12.50లక్షలతో 5చోట్ల నిర్మించే సీసీరోడ్లు, వేములవాడలో శివారు గ్రామమైన సిరిగలపల్లిలంకకు తాగునీరందించేందుకు జలజీవన్ మిషన్ నిధులు రూ.30లక్షలతో నిర్మించే పైపులైన్ పనులకు భూమిపూజ చేశారు. సర్పంచ్‌లు సాదే ఆశాజ్యోతి, కమిడి మంగాదేవి, వైసీపీ నాయకులు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్ పాల్గొన్నారు.

అరట్లకట్టలో రక్తదాన శిబిరం

కరప, జనవరి 22: అరట్లకట్ట గ్రామంలో ఆర్ఎస్ఎస్, రామభక్తులు ఆధ్వర్యంలో అయోధ్యలో బాలరాముని విగ్రహం ప్రతిష్ఠను పురస్కరించుకుని లైవ్ కార్యక్రమం నిర్వహించారు. కాకినాడ సత్కాళావాహిని కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో హనుమాన్ చాలీషా పారాయణం జరిగింది. భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 55మంది రక్తదానం చేశారు. ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, గ్రామ సర్పంచ్ గోపి నాగమణి, సమరసిత సేవా సమితి కన్వీనర్ పడాల రఘు తదితరులు పాల్గొన్నారు.

సి.రాయవరంలో 'మీ ఇంటికి మీ సత్యప్రభరాజా'

ప్రత్తిపాడు, జనవరి 22: ఏలేశ్వరం మండలంలో సి.రాయవరంలో ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ రాజా సోమవారం మీ ఇంటికి మీ సత్యప్రభరాజా కార్యక్రమం చేపట్టారు. ఆమె ఇంటింటికి వెళ్లి వారి కష్టాలు అడిగి మేనిఫెస్టోలోని అంశాలు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. పలివెల వెంకటేశ్వరరావు, పలివెల శ్రీను, ఈపు పెదరాజుబాబు, దేవర పెంటరాజు, ఒమ్మి రమణ, బాలిబోయిన తాతాజీ, ఈపు ప్రసాద్, మాజీ జడ్పీటీసీ జ్యోతుల పెదబాబు, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ఉన్నారు.

7 గ్యాస్ సిలిండర్ల స్వాధీనం

సామర్లకోట, జనవరి 22: పట్టణంలో పలు హోటళ్లలో గృహ అవసర గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారన్న నేరంపై సామర్లకోట మండల ఎంఎస్వో కీర్తి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది సోమవారం దాడులు నిర్వహించారు. పలు హోటళ్లలో అక్రమ వాడకాన్ని గుర్తించి 7 డొమస్టిక్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని 6ఏ పేరిట కేసులు నమోదు చేశారు. సిలిండర్లను స్థానిక గ్యాస్ ఏజన్సీ నిర్వాహకులకు స్వాధీనపరిచి జేసీ కోర్టుకు నివేదికలు అందజేసినట్టు కీర్తి తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తుని రూరల్, జనవరి 22: రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. గుల్లిపాడు నుంచి నర్సీపట్నం మధ్యలో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి జారిపడి 30ఏళ్ల వ్యక్తి మృతిచెందగా రైల్వే పోలీసులు సంఘటనా స్థలం పరిశీలించి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ షేక్ అబ్దుల్‌మారూప్ చెప్పారు.

అంతా రామమయం!

» అయోధ్య రామమందిరంలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ
» జిల్లాలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు
» ఘనంగా శోభాయాత్రలు
» బైక్ ర్యాలీలు, తరలివచ్చిన భక్తులు


పిఠాపురంలో నిర్వహించిన శోభాయాత్ర


గొల్లప్రోలు విష్ణాలయంలో రామ నామసంకీర్తనలు ఆలపిస్తున్న మహిళలు


తునిరూరల్ మండలం తేటగుంటలో దీపాలంకరణ


కొత్తపల్లిలో ఆజనేయ విగ్రహం వద్ద వానరం

పిఠాపురం, జనవరి 22: అయోధ్య రామమందిరంలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమాలతో కాకినాడ జిల్లా రామనామస్మరణతో మార్మోగింది. పిఠాపురంలోని వివిధ ప్రాంతాల్లో రామాలయాల్లో ప్రత్యేక పూజలు, ప్రదర్శనలు, ప్రసాదవితరణలు జరిగాయి. శ్రీరాముని పల్లకి సేవ జరిపారు. విశ్వహిందూపరిషత్, భజరంగదళ్ ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. పాదగయ క్షేత్రం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర పురవీధుల్లో సాగింది. ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కాకినాడ సిటీ: అయోధ్య శ్రీరామ మందిర ంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా దేవాలయం వీధి శివాలయం వద్ద నిర్వహించిన సీతారాముల శోభాయాత్రలో మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పాల్గొన్నారు. దుమ్ములపేట శ్రీరామ్‌సెంటర్ రామాలయం వద్ద నిర్వహించిన అన్నదానం, స్థానిక రాజాజీ వీధిలో పానకం పంపిణీలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమాల్లో గ్రంధి నారాయణరావు, బచ్చు శేఖర్, ఎరిపల్లి రాము, దంగేటి సతీష్, చోడిపల్లి సతీష్, మూగు రాజు, కొండ్రు తాతారావు, మాదే ఆంద్రీయ పాల్గొన్నారు.

గొల్లప్రోలు: గొల్లప్రోలు పట్టణం, మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. సీతారామస్వామి దేవస్థానం, రామకోవెళ్లు, రామాలయాల్లో ప్రత్యేక పూజలు, శ్రీరామనామ సంకీర్తనలు, భజనలు నిర్వహించారు. చేబ్రోలులోని సీతారామస్వామి దేవస్థానంలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ పూజలు జరిపారు. రాత్రి పలు ఆలయాల్లో దీపారాధన జరిగింది. చెందుర్తి రామాలయంలో జరిగిన కార్యక్రమంలో వర్మ పాల్గొని దీపాలు వెలిగించారు.

కొత్తపల్లి: కొత్తపల్లిలో భక్తులు కాషాయరంగు శ్రీరామ్ జెండాలతో గ్రామాల పురవీధుల్లో శ్రీరామనామ కీర్తనలు ఆలపిస్తూ శోభాయాత్ర సాగించారు. వాకతిప్ప శాలివాసరామాలయం, గోర్స సీతారామాంజనేయ స్వామిఆలయం, నాగులాపల్లి శివాలయాల ఆధ్వర్యంలో భక్తులు రామనామాలు స్మరిస్తూ భజనలు చేశారు. రామాలయాల వద్ద భారీ అన్న సంతర్పణ చేశారు. కొత్తపల్లిలో శ్రీరామభంటు వీరహనుమాన్ విగ్రహం వద్ద అన్నసంతర్పణలో భక్తులందరూ పాల్గొనగా చెట్టుమీద నుంచి వానరం ఒకటి హనుమాన్ విగ్రహం వద్దకు వచ్చి అక్కడే ఉన్న అరటిపండు చేతపట్టుకుని నమస్కారం చేయడాన్ని భక్తులు ఆశ్చర్యంగా తిలకించారు.

సామర్లకోట: సామర్లకోటలో శ్రీరామభక్తులు ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. హనుమాన్ జెండాలు చేతబట్టి కాషాయదుస్తులతో నుదుట శ్రీరామ్ పేరిట రిబ్బన్లు ధరించి పురవీధులమీదుగా ప్రదర్శనలు నిర్వహించారు. పట్టణ మార్వాడీ సంఘ్, మహదేవ్ మొబైల్స్ అధినేత దినేష్‌కుమార్ ఝూన్సీల నేతృత్వంలో జైనులు కుటుంబసభ్యులతో జై శ్రీరామ్ అంటూ రోడ్లపై నృత్యాలు చేశారు. ఆంజనేయ సమేత సీతారామ చంద్రమూర్తుల చిత్రపటాలను ప్రత్యేక వాహనాలపై అలంకరించి పురవీధులు మీదుగా ప్రదర్శనలు చేశారు. పెద బ్రహ్మదేవంలో రామాలయం వద్ద అఖండ దీపారాధన పూజల్లో ఎమ్మెల్యే చినరాజప్ప తనయుడు రంగనాగ్, తోటకూర శ్రీనివాస్ పాల్గొన్నారు. కంచి మహాసంస్థానం సామర్లకోట ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం పాదాల చెంతన ప్రత్యేక పారాయణ పూజలు నిర్వహించారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండలంలోని ధర్మవరం, రాచపల్లి, ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి గ్రామాల్లో శోభయాత్రలు నిర్వహించారు. ధర్మవరం మంగాయమ్మపేట ఆలయంలో టీడీపీ నాయకులు ముదునూరి మురళీకృష్ణంరాజు పూజలు చేశారు. రాచపల్లిలోని అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో సీతారామ లక్ష్మణ హనుమ విగ్రహాలకు పూజలు చేశారు. పెద్దనపల్లి రామాలయంలో బాల రాముడికి ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించి గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పాల్గొన్నారు. ధర్మవరంలో శోభయాత్ర నిర్వహించి శ్రీరాముని జెండాలు ఇంటింటికిపంపిణీ చేశారు.

సర్పవరం జంక్షన్: కాకినాడ 49వ డివిజన్ పైడా వారి వీధిలో బీజేపీ సీనియర్ నేత పైడా కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఘనంగా శ్రీరామ సంకీర్తన నిర్వహించారు. ఎల్ఈడీ స్క్రీన్‌పై శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఘట్టాన్ని భక్తులు వీక్షించారు. భక్తిపారవశ్యానికి లోనయ్యారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు, అయోధ్య రామాలయ చిత్రపటాలను భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ ఛైర్మన్ వైడీ రామారావు, మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు, బీజేపీ సీనియర్ నాయకులు ముత్తా నవీన్, రంబాల వెంకటేశ్వరరావు, పైడా భవానీ ప్రసాద్, మాజీ కార్పొరేటర్ పాలిక ఉషారాణి, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

జగ్గంపేట: జగ్గంపేటలో రామాలయాలు, అంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగ్గంపేట రాజస్థాన్ మార్వాడి రామ వికారా కుటుంబ సభ్యులతో రామనామ కీర్తనలు చేస్తూ ఊరేగింపులు కొనసాగించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్తకొండ బాబు, అభిమానులు, నాయకులు, భక్తులు ఉన్నారు.

పెద్దాపురం: పట్టణ, మండల పరిధిలోని గ్రామాలు, ఆలయాలు రామనామస్మరణతో మారుమోగాయి. శోభాయాత్రలు, ఏకాహ భజనలు నిర్వహించారు. అలాగే రామమందిరంలో బాలరాముడు ప్రతిష్ఠ మహోత్సవాన్ని తిలకించేందుకు భారీ ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. పలు గ్రామాల్లో అన్నప్రసాద వితరణ చేశారు.

తుని రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక పీఠం తపోవనం క్షేత్రంలో సీతారామ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. తేటగుంటలో నిర్వహించిన శ్రీరామ పేరుతో దీపాలంకరణ ఆకట్టుకుంది. పలు హైందవ సంఘాలు కాషాయ జెండాలు, కరపత్రాలు పంపిణీ చేశారు.

రౌతులపూడి: రౌతులపూలో ఏడుకొండల వారి ఆలయం నుంచి కనుల విందుగా శోభాయాత్ర నిర్వహించారు. బ్యాండ్ మేళాలు, కోలాటం ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో యువకులు, మహిళలు పాల్గొన్నారు.

గండేపల్లి: మల్లేపల్లిలో పెద్ద రామాలయం నుంచి భజన బృందాలు 150 బైక్‌లతో ర్యాలీ చేసి శ్రీరామనామ నామంతో గండేపల్లి, మురారి, ఎన్టీరాజపురం, కె.గోపాలపురం, సుబ్బయ్యంపేట, ఉప్పలపాడు గ్రామాల మీదుగా మల్లేపల్లి చేరి రామాయం వద్ద పూజలు చేశారు.

కోటనందూరు: కేఏఅగ్రహారం శివాలయం పూజారి దుర్గ ఆధ్వర్యంలో గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు


కిర్లంపూడి: టీడీపీలోకి ఆహ్వానిస్తున్న జ్యోతుల నెహ్రూ


తుని రూరల్: టీడీపీలోకి ఆహ్వానిస్తున్న రామకృష్ణుడు

కిర్లంపూడి, జనవరి 22: కిర్లంపూడి మండలం వీరవరంలో వైసీపీ ఎంపీపీ తోట రవి, జడ్పీటీసీ తోట సత్యవతి, గాంధీ, పలువురు భారీ ఎత్తున వైసీపీని వీడి టీడీపీలో చేరారు. సోమవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, భోపాలపట్నం గ్రామసర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు, శృంగరాయునిపాలెం గ్రామ సర్పంచ్ పట్టు చంటిబాబు, ఉపసర్పంచ్ బొజ్జం శ్రీను, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జగపతినగరం గ్రామంలో గౌరీ శంకర్ల ఆలయం వద్ద బీసీ సమావేశం టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు ఆధ్వర్యంలో మండల బీసీ సెల్ అధ్యక్షుడు సూరిశెట్టి వెంకట శివ అధ్యక్షతన చేపట్టారు. జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమానికి పరిశీలకులుగా రాష్ట్ర పెరికి సాధికారికి సమితి కన్వీనర్ వనపర్తి బద్రి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, అడపా భరత్‌కుమార్, సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు, కొత్త కొండబాబు, పోతుల మోహన్‌రావు, గోడే బాల, జగపతినగరం సర్పంచ్ గుడాల శ్రీలతా రాంబాబు, కంటా శ్రీను, కంచుమర్తి రాఘవ, వేలంక సర్పంచ్ రాయుడు బాబురావు, జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు అత్తిలి వీరబ్రహ్మం, రాయవరపు శ్రీనివాస్, కాళ్ళ వెంకటేష్, గరగా గోవిందు తదితరులున్నారు.

జగ్గంపేటలో...

జగ్గంపేట, జనవరి 22: జగ్గంపేటకి చెందిన బీమన వారి కుటుంబాలు బీమన వెంకటేశులు, బీమన లోవ శ్రీను, బీమన వీరబాబు, బీమన శ్రీను, బీమన శివ, బీమన స్వామి తదితర 30 కుటుంబాల వారు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతులనెహ్రూ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, జీను మణిబాబు, బద్ది సురేష్, వాకారెడ్డి వైభోగుల కొండబాబు యాదవ్, సాంబత్తుల చంద్రశేఖర్ తదితరులున్నారు.

జెడ్‌రాగంపేటలో...

గండేపల్లి, జనవరి 22: జెడ్ రాగంపేట గ్రామంలో కంటే సురేంద్ర ఆధ్వర్యంలో వైసీపీ నుంచి 30కుటుంబాలకు పైగా టీడీపీలోకి చేరారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. నెహ్రూని టీడీపీలో చేరిన వారు గజమాలతో సత్కరించారు. మండలాధ్యక్షులు పోతుల మోహన్‌రావు, ఎస్వీ ఎస్ అప్పలరాజు, కొత్త కొండబాబు, మారిశెట్టి భద్రం, బొల్లంరెడ్డి రామకృష్ణ, పైణ్ణి వెంకటేశ్వరరావు, సుంకవిల్లి సత్యనారాయణ, గోవింద చౌదరి, కందుల బాబ్జి పాల్గొన్నారు.

కాకరాపల్లిలో...

తుని రూరల్, జనవరి 22: కాకరాపల్లిలో పలువురు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. వారికి పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. చేరిన వారిలో వైసీపీ కీలక నేత కాకరపల్లి సర్పంచ్ బంటు వెంకటేశ్వరరావు, వార్డు మెంబర్లు కీర్తిరాము, కీర్తి సత్తిబాబు, ఎస్.తాతీలు, పెనుమచ్చు గణేష్, రాష్ట్ర భవన నిర్మాణ సంఘ అధ్యక్షులు కుంకుపూడి దొరబాబు ఉన్నారు. ఎస్ఎస్వీ నగరంలో రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు సమక్షంలో టీడీపీ నాయకులు లోకా శ్రీను ఆధ్వర్యంలో వైసీపీ కార్యకర్తలు, కుటుంబాలు పెద్ద ఎత్తున టీడీపీలో చేరారు. జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు సుర్లలోవరాజు, మోత్కూరు వెంకటేష్, చింతమనేడి నాగ సోమరాజు,పలువురు పాల్గొన్నారు.

నేడు గండ్రేడులో చేరికలు

పెదపూడి, జనవరి 22: గండ్రేడుకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు 200 మంది మంగళవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరనున్నట్లు టీడీపీ మండలాధ్యక్షుడు జుత్తుక కృష్ణ తెలిపారు.

జగ్గంపేటలో అన్న క్యాంటీన్

జగ్గంపేట, జనవరి 22: కాకినాడ రోడ్‌లోని ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద టీడీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆదేశాలతో నిర్వహిస్తున్న ప్రతి సోమవారం నిర్వహిస్తున్న అన్న కాంటీన్‌లో రాష్ట్ర కార్యదర్శి కోర్పు లచ్చయ్యదొర ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన భోజనాలను నెహ్రూ పేదలకు వడ్డించారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, దాపర్తి సీతారామయ్య, చాగంటి సత్యనారాయణ మూర్తి, డేగల సత్తిబాబు, నండ్ల చిరంజీవి, కొల్లురామకృష్ణ, చెలికాని హరిగోపాల్, ఎండీ కాజా, బోర సత్తిబాబు, యార్లగడ్డ నారాయణ, మారిశెట్టి గంగ, అనిల్ పాల్గొన్నారు.

కాకినాడలో 'స్పందన'

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 22: నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలు జరిగాయి. కమిషనర్ నాగనరసింహారావుకు ప్రజా సమస్యలపై 13మంది వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఈలు పి.సత్యకుమారి, పి.వెంకటరావు, హెల్త్‌ఆఫీసర్ పృథ్వీచరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ పాల్గొన్నారు.

నారా భువనేశ్వరికి స్వాగత ఏర్పాట్లు

తుని రూరల్, జనవరి 22: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు అక్రమ అరెస్ట్‌తో మనస్థాపానికి గురై గుండెపోటుతో మృతిచెందిన తునిరూరల్ ఎర్రకోనేరు గ్రామానికి చెందిన ఇసరపు నూకరాజు కుటుంబాన్ని ఓదార్చేందుకు తుని వస్తున్న నారా భువనేశ్వరికి స్వాగత ఏర్పాట్లను టీడీపీ నాయకులు పోల్నాటి శేషగిరి ఆధ్వర్యంలో చేపడుతున్నారు. స్థానిక కార్యకర్తలతో సమావేశమై పలు సూచనలు ఇచ్చారు..

ముద్రగడను కలిసిన విశ్వ బ్రాహ్మణ సంఘం సభ్యులు

కిర్లంపూడి, జనవరి 22: మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభాన్ని కాకినాడ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు అత్తిలి వీరబ్రహ్మం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కార్యవర్గం ఏర్పాటు కావడంతో ఉపాధ్యక్షుడు ముదపాక రమణ, సెక్రటరీ కె.సత్యనారాయణ, పొన్నాడ బ్రహ్మానందం, ఎ.ఉమాశంకర్ ఆయన్నికలవగా ముద్రగడ అభినందించారు.

తహశీల్దార్‌గా దొర బాధ్యతలు

కాకినాడ సిటీ, జనవరి 22: కాకినాడ అర్బన్ తహశీల్దార్‌గా కె.చల్లన్‌దొర సోమవారం బాధ్యతలు చేపటారు. పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన చల్లన్‌దొర జిల్లా అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. తహశీల్దార్ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చారు.

ఉద్యాన పంటల సాగుపై అవగాహన

పెద్దాపురం, జనవరి 22: మండలంలోని కట్టమూరులో రావెప్ విద్యార్థులు (పార్వతీపురం) ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ బి.ప్రసన్న కుమార్ (పార్వతీపురం) హాజరయ్యారు. వినూత్న యాజమాన్య పద్ధతులు, పాలీహౌస్, వర్మీ కంపోస్టు, సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఉద్యాన పరిశోధనాస్థానం శాస్త్రవేత్త ఎం.జానకి, అసోసియేట్ రిప్రజం టేటీవ్ అరుణకుమారి, ఆర్బీకే సిబ్బంది చిలకమ్మ, విజయదుర్గ,అమృత పాల్గొన్నారు.

మద్యంతో మహిళ అరెస్టు

తాళ్లరేవు, జనవరి 22: కోరింగ పంచాయతీ చినబొడ్డువెంకటాయపాలెం గ్రామానికి చెందిన పెసింగి దుర్గ యానాం నుంచి అక్రమ 1,398 మద్యం బాటిల్స్‌ను తరలించి బెల్టుషాపులో విక్రయిస్తుండగా కోరింగ పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడిచేసి పట్టుకుని మద్యం స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలు పెసింగి దుర్గను అరెస్టు చేసి కోర్టుకి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

నేత్రదానం

తాళ్లరేవు, జనవరి 22: పి.మల్లవరం గ్రామానికి చెందిన పోలిశెట్టి నాగేశ్వరరావు(60) సోమవారం గుండెపోటుతో మరణించారు. సామాజిక కార్యకర్త దూళిపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో ఆయన కుటుంబ సభ్యుల అంగీకారంతో నాగేశ్వరరావు నేత్రాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐబ్యాంక్‌కు దానం చేశారు. ఆ కుటుంబాన్ని పలువురు అభినందించారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కోటనందూరు, జనవరి 22: మండలంలోని కాకరపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. నేతల అప్పారావు ఆలయాన్ని నిర్మించారు. అన్నదానం నిర్వహించగా 3 వేలమందికిపైగా స్వీకరించారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం 50 ఏళ్లు వెనక్కి

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ

గొల్లప్రోలు రూరల్, జనవరి 22: వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలయిందని, అభివృద్ధిలో 50 ఏళ్లు వెనక్కి వెళ్లిందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామంలో సోమవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ, మన ఇంటికి మన వర్మ కార్యక్రమాలను నిర్వహించారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి, చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేశారు. వర్మ మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలను జగన్‌రెడ్డి ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. నాలుగున్నర సంవత్సరాల పాలనలో ఒక రోడ్డు వేయలేకపోయారని ఎద్దేవా చేశారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులకు ఇప్పటి వరకూ పరిహారం ఇవ్వలేదని, గత రెండేళ్లుగా ఇదే పరిస్థితి ఉందని తెలిపారు. రైతులను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. రానున్న రోజుల్లో తెలుగుదేశం-జనసేన ప్రభుత్వం ఏర్పడటం ఖాయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మ ండలాధ్యక్షుడు ఉలవకాయల దేవేంద్రుడు, మాజీ జడ్పీటీసీ మడికి ప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు బోనబోయిన శివ, మట్ల శ్రీను, నక్కా సింహాచలం, భద్రరావు, ఆరుగుల తాతీలు తదితరులున్నారు.

యూటీఎఫ్ ధర్నా

పిఠాపురం, జనవరి 22: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పిఠాపురంలో సోమవారం ధర్నా, ప్రదర్శన నిర్వహించారు. యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ప్రతి నెలా 1న ఇవ్వాల్సిన జీతాలు 17వ తేది దాటినా వస్తుందో రాదో తెలియని పరిస్థితి ఉందన్నారు. పీఆర్సీ డీఏ ఎరియర్లు రూ.12,000కోట్లు, పీఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిలు రూ.1,500కోట్లు, సరెండర్ లీవు బకాయిలు రూ.4,500 కోట్లు, మొత్తంగా రావాల్సిన రూ.18వేల కోట్లును తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణం బకాయిలు చెల్లించకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో యూటీఎఫ్ జిల్లా ప్రదాన కార్యదర్శి టి.రవిచక్రవర్తి, జిల్లా కార్యదర్శి సీహెచ్.సూరిబాబు, షేక్ రహీమాన్ బీ, టి.సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

తుని రూరల్: యూటీఎఫ్ నేతలు తునిలో నిరసన ర్యాలీ చేశారు. ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సెలర్ జి.సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి కె.సురేష్ కుమార్, టి.సీతారామయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ప్రభుత్వ బెదిరింపులకు భయపడి...

అంగన్‌వాడీలు విధుల్లో చేరిక

» మరికొందరు విజయవాడకు పయనం » అడ్డుకున్న పోలీసులు

సామర్లకోట/తాళ్లరేవు/పిఠాపురం/కొత్తపల్లి/తునిరూరల్/ గండేపల్లి/ కాకినాడ సిటీ, జనవరి 22: అంగన్‌వాడీలపై ప్రభుత్వం కక్ష సాధిస్తోంది. వారి ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తోంది. 42రోజులుగా సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు తాడోపేడో తేల్చుకునేందుకు కొందరు తాడేపల్లి వెళ్లారు. మరికొందరు టెర్మినేషన్ నోటీసులకు భయపడి ఇక్కడే ఉండిపోయారు. విధిలేని పరిస్థితుల్లో అధికారుల ఒత్తిడితో అక్కడక్కడా కొందరు విధుల్లో చేరారు. అలా సామర్లకోటలో సోమవారం 39మంది అంగన్‌వాడీ సిబ్బంది విధులకు హాజరవుతున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో జి.ఉషాకు అంగీకారపత్రాలు అందజేశారు. పిఠాపురం నియోజకవర్గంలో 318 అంగన్‌వాడీ కేంద్రాలు, 4 మినీ కేంద్రాలు ఉండగా, ఇందులో 614మంది వర్కర్లు, హెల్పర్లు ఉన్నారు. వీరిలో నలుగురు మాత్రమే సోమవారం విధుల్లో చేరారు. కొత్తపల్లి మండలంలో కొందరు ఇంటికి పరిమితం కాగా కొందరు విజయవాడలో సమ్మెకు వెళ్లారు. తాళ్లరేవులో కోరింగ పోలీసులు కొందరు అంగన్‌వాడీలను సోమవారం అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌లో కూర్చోబెట్టి తిరిగి పంపించేశారు. పిఠాపురం, ప్రత్తిపాడు, తుని మండలాల నుంచి విజయవాడ తరలివెళ్లిన వందల సంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లను విజయవాడలో పోలీసులు అరెస్ట్ చేశారు. బస్సుల్లో ఎక్కించి పలు ప్రాంతాల పోలీస్‌స్టేషన్‌లకు తిప్పుతూ చిత్రహింసలకు గురి చేస్తున్నారని వాపోయారు. కాకినాడ కలెక్టరేట్ సమీపంలోని శిబిరం వద్ద 42వరోజు అంగన్‌వాడీలు సమ్మె కొనసాగించారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి ఎం.రమణమ్మ, సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజ శేఖర్, సీఐటీయూ నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు సి.వెంకట్రావు, దుంపల ప్రసాద్ ఆందోళనకు సంఘీభావం తెలిపారు. గండేపల్లిలో అంగన్‌వాడీలు విజయవాడ వెళ్లకుండా పోలీసులు వాహనాల తనిఖీలు చేసి సుమారు 40 మందిని ఎస్ఐ రామకృష్ణ, సిబ్బందితో అడ్డుకుని వెనక్కి పంపించారు.

టీడీపీకి బీసీలే వెన్నెముక : రాజప్ప


జయహో బీసీ సభలో మాట్లాడుతున్న రాజప్ప

పెద్దాపురం, జనవరి 22: టీడీపీకి బీసీలే వెన్నెముక అని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. టీడీపీ ఆధ్వర్యంలో పట్టణంలో కొత్తపేట, జె.తిమ్మాపురం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన జయహో బీసీ సభలో ఆయన మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కార్పొరేషన్లతో పాటు టీడీపీ హయాంలో ఇచ్చిన రుణాలు కూడా నిలిపివేశారన్నారు. బీసీల విషయంలో ఎన్టీఆర్ చూపిన బాటలోనే చంద్రబాబు పయనిస్తున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు ఉన్నతస్థానం ఉంటుందన్నారు. జనాభాలో సగం ఉన్న బీసీ వర్గాల ఓట్లను కొల్లగొట్టిన వైసీపీ ఎన్నికల అనంతరం వారికి నష్టం చేకూర్చిందన్నారు. మరోసారి జగన్ కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు బీసీలకు చేయూతనందించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రాజాసూరిబాబురాజు, తూతిక రాజు, కొరిపూరి రాజు, రంధి సత్తిబాబు, కందుల విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.